నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 6 జనవరి 2024 | SURYAPET

సూర్యాపేట మున్సిపాలిటీకి ఓడీఎఫ్++

పారిశుధ్యం, పబ్లిక్ కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్వహణలో గుర్తింపు

బొడ్రాయిబజార్, జనవరి 5 : కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సూర్యాపేట మున్సిపాలిటీ ఓడీఎఫ్++గా గుర్తింపును సొంతం చేసుకుందని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణాల్లో పారిశుధ్యం, పబ్లిక్ కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్వహణలో ప్రాధాన్యం లభించిందని పేర్కొన్నారు. గత అక్టోబర్ నెలలో కేంద్రం నుంచి వచ్చిన బృందం సూర్యాపేట మున్సిపాలిటీలో బహిరంగ మల మూత్ర విసర్జనకు తీసుకుంటున్న చర్యలు, మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రతను గుర్తించి ఓడీఎఫ్++గుర్తింపును ఇచ్చినట్లు తెలిపారు. ఓడీఎఫ్++ గుర్తింపు దక్కడం గర్వంగా ఉందని, అందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు చెప్పారు.

పట్టభద్రులకు పరీక్ష

మళ్లీ ఓటు నమోదు తప్పనిసరి

- కొత్తగా నమోదు చేయించుకుంటేనే ఓటు హక్కు
- చెల్లుబాటు కాని గత ఎన్నికల ఓటర్ల జాబితా
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మొదలైన ఓటర్ల నమోదు
- వచ్చే నెల 6వ తేదీ తుది గడువు



నల్లగొండ ప్రతినిధి, జనవరి5(నమస్తే తెలంగాణ) : త్వరలో జరుగనున్న నల్లగొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక గ్రాడ్యుయేట్స్‌కు పరీక్షగానే మారింది. అర్హత కలిగిన పట్టభద్రులంతా ఉప ఎన్నికల్లో ఓటు వేయాలనుకుంటే తప్పనిసరిగా ఓటును కొత్తగా నమోదు చేయించుకోవాల్సిందే. పాత జాబితాలో తమ ఓటు ఉందికాబట్టి ఓటు వేస్తామంటే కుదరదు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నిక జరిగిన ప్రతిసారి పట్టభద్రులంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందే. అందుకు గత నెల 30 నుంచి ఓటు నమోదు కార్యక్రమానికి ఎన్నికల సంఘం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వచ్చే నెల 6వ తేదీ వరకు తుది గడువు విధించింది. దాంతో అర్హులైన పట్టభద్రులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తున్నది.

పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఉప ఎన్నికపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది.

2027 మార్చి 29వ తేదీ వరకు మిగిలిన పదవీ కాలం కోసం జరుగనున్న ఉప ఎన్నిక కోసం కసరత్తు మొదలైంది. అందులో భాగంగా తొలి అంకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రాధాన్యతనిస్తూ ఓటు నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత నెల 30వ తేదీన పబ్లిక్ నోటీసు జారీ చేస్తూ అదే రోజు నుంచి ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారిగా వ్యవహరిస్తున్నారు. వచ్చే నెల 6వ తేదీ వరకు ఫారం-18ద్వారా ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తై మూడేండ్లు నిండిన వారందరూ దరఖాస్తుకు అర్హులుగా నిర్దేశించారు. వచ్చే నెల 6వ తేదీ నాటికి వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించిన అనంతరం అదే నెల 21న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. ఈ జాబితాపై మార్చి 14 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. చివరగా అభ్యంతరాలను పరిష్కరించిన అనంతరం ఏప్రిల్ 4వ తేదీన తుది ఓటర్ల జాబితా పూర్తి చేయాల్సి ఉంది. తుది ఓటర్ల జాబితా రూపకల్పన అనంతరం ఏ క్షణమైనా ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఏప్రిల్ చివరలో లేదా మే మొదటి వారంలో ఎన్నిక పూర్తి కావచ్చని అంచనా. జూన్ 8వ తేదీ లోపు ఉప ఎన్నిక పూర్తికి కేంద్ర ఎన్నికల సంఘం గడువు విధించింది.

కొత్తగా ఓటు హక్కు నమోదు తప్పనిసరి

సాధారణ ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో ఒకసారి ఓటు నమోదు చేసుకుంటే సరిపోతుంది. కానీ పట్టభద్రుల ఎన్నికల్లో అలా కుదరదు. ఎన్నిక జరిగిన ప్రతిసారి గ్రాడ్యుయేట్ కొత్తగా ఓటుహక్కు నమోదు చేయించుకోవాల్సిందే. 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో ఓటు వేసాము కాబట్టి అదే జాబితాతో ఓటు వేస్తామంటే అవకాశం లేదు. అందుకే ఓటుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తాజాగా ఓటు కోసం దరఖాస్తు చేయాలని అధికార యంత్రాంగం సూచిస్తున్నది. వాస్తవంగా 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 5,05,565 మంది ఓటర్లుగా నమోదయ్యారు. 2015 మార్చిలో జరిగిన ఎన్నికల్లో 2,81,138 మంది ఓటర్లుగా ఉన్నారు. 2015తో పోలిస్తే 2021 మార్చి నాటికి 22,4427 మంది అదనంగా ఓటర్లు చేరారు. ప్రస్తుతం ఉప ఎన్నిక కావడంతో ఏ మేరకు ఓటర్ల నమోదు జరుగుతుందనే వేచి చూడాలి. గత ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఓటరు నమోదు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దాంతో పెద్ద ఎత్తున ఓటర్ల నమోదు జరిగిందనేది స్పష్టం. ఉప ఎన్నిక కావడంతో ఈ సారి ఇప్పటికైతే అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఉప ఎన్నికపై రాజకీయ పార్టీలు, పోటీ చేయాలనుకునే ఆశావహులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సంక్రాంతి తర్వాత ఓటర్ల నమోదు ఊపందుకోవచ్చన్నది అంచనా.

సూర్యాపేట క్యాంపు కార్యాలయంలో బేతస్త మినిస్ట్రీస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

బేతస్త మినిస్ట్రీస్ క్యాలెండర్ ఆవిష్కరణ

సూర్యాపేట టౌన్, జనవరి 5 : బేతస్త మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ నెమ్మాది భిక్షం, కౌన్సిలర్ చింతలపాటి భరత్, నాయకులు ఆకుల లవకుశ, పాస్టర్లు ఫిలిప్, హోసన్నా, మామిడి తిరుమలేశ్, దున్న శ్యామ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి శుభాకాంక్షలు

సూర్యాపేటలో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ మెదక్ జిల్లాకు చెందిన ప్రముఖ ఛాయా చిత్రకారుడు డానియెల్ శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాను స్వయంగా చిత్రీకరించిన భారీ కామధేనువు చిత్ర పటాన్ని బహూకరించి తన అభిమానాన్ని చాటుకున్నాడు. కార్యక్రమంలో నాయకులు బూర బాల సైదులు, జంపాల శ్రీను పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఎంజీయూ ఖ్యాతి చాటాలి

- ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి

నృత్యం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రామగిరి, జనవరి 5 : ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన వలంటీర్లు జాతీయ స్థాయిలో నిర్వహించే శిబిరంలో సత్తా చాటి మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఖ్యాతి చాటాలని ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి ఆకాంక్షించారు. జాతీయ సమైక్యతా శిబిరానికి ఉమ్మడి జిల్లాలోని కళాశాలల వలంటీర్ల ఎంపికను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వలంటీర్లకు కమ్యూనికేషన్ స్కిల్స్, భాషా పరిజ్ఞానం, సాంస్కృతిక ప్రదర్శనలు, ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. అనంతరం ఆయ న మాట్లాడుతూ.. విద్యతోపాటు సామాజిక సేవకు ఎన్ఎస్ఎస్ చక్కని వేదిక అని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు వీసీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఆర్.హరికిషన్ రావు, వివిధ కళాశాలల పీఓలు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులు వీరే..

మహిళల విభాగంలో ఎ.స్వప్న(టీఎస్‌డబ్ల్యూ ఆర్‌డీసీ, నల్లగొండ), వి.నిత్య(ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, దేవరకొండ), పురుషుల విభాగంలో ఈ.వెంకటేశ్(ఆర్ట్స్ కళాశాల, ఎంజీయూ), బి.మహేశ్(ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మిర్యాలగూడ) ఉన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

12లోగా దరఖాస్తులను ఎంట్రీ చేయాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, జనవరి 5 : అభయ హస్తం అమలులో భాగంగా ప్రజాపాలన సభల్లో స్వీకరిస్తున్న దరఖాస్తులను ఈ నెల 12లోగా డేటా ఎంట్రీ పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన సభల్లో ప్రజల నుంచి తీసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే క్రమంలో దరఖాస్తుదారుల పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. తప్పులకు ఆస్కారం లేకుండా ఆపరేటర్లు ఒకటికి రెండు సార్లు పరిశీలించి ఎంట్రీ చేయాలన్నారు. ఎంపీడీఓలు, తాసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు దరఖాస్తులను జాగ్రత్తగా భద్రపర్చాలన్నారు. డేటా ఎంట్రీ కోసం జిల్లా వ్యాప్తంగా 489 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తు కుడి వైపున డేటా ఎంట్రీ ఆపరేటర్ సంతకం చేయాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈడీఎం గఫార్‌తోపాటు డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఉచిత ప్రయాణానికి గుర్తింపు కార్డు తప్పనిసరి

ఆధార్‌లో తెలంగాణ ప్రాంతం చిరునామాలో ఆంధ్రప్రదేశ్ అని ఉన్నా నో ప్రాబ్లెమ్

ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

రామగిరి, జనవరి 5 : మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి అని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముద్రించిన తెలంగాణ ప్రాంత చిరునామా కలిగిన ఆధార్‌కార్డుతోపాటు డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ గుర్తింపు కార్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ప్రభుత్వ రంగ సంస్థ కార్డులు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ డైరెక్టరేట్ జారీ చేసిన గుర్తింపు కార్డులు చూపించి పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణం చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను తప్పకుండా పాటించాలని సూచించారు.

ఆర్థిక స్వావలంబనపై అవగాహన అవసరం : ప్రిన్సిపాల్ సుల్తానా

రామగిరి, జనవరి 5 : విద్యార్థులు తమ చదువు పూర్తికాగానే స్థిరపడేందుకు ఆర్థిక స్వావలంబనపై అవగాహన అవసరమని చర్లపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ సుల్తానా అన్నారు. శుక్రవారం కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో వ్యాపారం చేయాలనుకునే విద్యార్థులకు ఆ రంగంలో ఎంఎస్ఎంఈ-డీఎఫ్ఓ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న స్కీమ్‌లు, వాటికి దరఖాస్తు చేసే విధానం గురించి వివరించారు. కళాశాల కామర్స్ ఇన్‌చార్జి అపర్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు బి.సత్యవతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళేశ్వరం జలాలతో నీలి విప్లవం

నిండుకుండలా నీటి వనరులు

కేసీఆర్ సర్కార్ సాయంతో విరివిగా చేప పిల్లల పెంపకం

10 మండలాల్లో మత్స్యకారులకు పెరిగిన ఆదాయం

ఏడేండ్ల క్రితం రూ.15 కోట్లు.. ప్రస్తుతం రూ.114 కోట్లు

కాళేశ్వరం జలాల రాకతో సూర్యాపేట జిల్లాలో నీలి విప్లవం ఊపందుకున్నది. కేసీఆర్ ప్రభుత్వం మిషన్ కాకతీయలో భాగంగా చెరువులను పునరుద్ధరించగా ప్రస్తుతం అవి వేసవిలో సైతం నిండుకుండను తలపిస్తున్నాయి. దానికి తోడు ప్రభుత్వ సాయంతో మత్స్యకారులు విరివిగా చేపలు పెంచుతున్నారు. కాళేశ్వరం ఆయకట్టు పరిధిలోని తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లోని 10 మండలాల మత్స్యకారుల ఆదాయం ఏడేండ్ల క్రితం వరకు రూ.15కోట్లు ఉంటే ప్రస్తుతం అది రూ.114కోట్లకు చేరడం విశేషం.

– సూర్యాపేట, జనవరి 5 (నమస్తే తెలంగాణ)

ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధి అర్వపల్లి మండలం బొల్లంపల్లి గ్రామంలోని ఒట్టికుంట చెరువులో శుక్రవారం పట్టిన చేపలు

ఉచితంగా చేపపిల్లల పంపిణీతో..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం తర్వాత అంతటి ప్రాధాన్యం కలిగింది చేపల పెంపకమే. దాన్ని ప్రోత్సహించి మత్స కార్మికులకు ఉపాధి కల్పించాలని కేసీఆర్ సర్కారు భావించింది. దానిలో భాగంగా మునుపెన్నడూ లేని విధంగా మత్స సహకార సంఘాలకు చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేసింది. దీంతో చేపల పెంపకం గణనీయంగా పెరిగింది.

కరువు నేలలో మత్స్యసిరులు

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తుంగతుర్తి, తిరుమలగిరి, నాగారం, అర్వపల్లి, మద్దిరాల, నూతనకల్ మండలాలతో పాటు సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని చివ్వెంల, ఆత్మకూర్.ఎస్, పెన్‌పహాడ్, కోదాడ నియోజకవర్గ పరిధిలోని మోతె మండలాలు శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్నాయి. కాళేశ్వరం వచ్చేంత వరకు ఈ మండలాలు కరువుతో అల్లాడుతూ చేపలు తిందామంటే దొరుకని పరిస్థితి. కేసీఆర్ సర్కార్ వచ్చాక మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువులు పునరుద్ధరించారు. శ్రీరాంసాగర్ రెండోదశ ద్వారా జిల్లాలోని ఈ ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతాలకు కాళేశ్వరం జలాలు రావడంతో చెరువులన్నీ నిండాయి. వ్యవసాయం పండుగలా మారింది. ప్రభుత్వమే ఉచితంగా కోట్లాది చేప పిల్లలు పంపిణీ చేయడంతో ప్రస్తుతం పుష్కలంగా చేపలు లభిస్తున్నాయి. స్థానిక అవసరాలకు పోగా ఇతర ప్రాంతాలకూ విక్రయిస్తున్నారు. గతంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే చేపలు కొని తినేవారు. ఇప్పుడా ఆ పరిస్థితి లేదు.

మత్స్యసంపద

సంవత్సరం	నీరు ఉన్న చెరువులు	పంపిణీ చేసిన చేప పిల్లలు(లక్షలు)	చేతికి వచ్చిన చేపలు(కిలోలు)	మొత్తం విలువ (రూ.కోట్లలో)
2016-17	52	35	17	15
2017-18	74	41	23	18
2018-19	96	127.74	47	38
2019-20	208	133.31	66	79
2020-21	278	185.57	95	114
2021-22	278	186.84	96	114
2022-23	278	185.30	95	114

రూ.15 కోట్ల నుంచి రూ.114కోట్లకు ఆదాయం

ఏడేండ్ల క్రితం వరకు జిల్లాలోని 10 మండలాలు కరువుతో అల్లాడేవి. 278 చెరువులకు గానూ 15శాతం చెరువుల్లో మాత్రమే ఓ స్థాయిలో నీరు ఉండేది. మరో పదిశాతం చెరువుల్లో కొద్దిపాటి నీరు ఉండడంతో మత్స్య కార్మిక సొసైటీల ఆధ్వర్యంలో చేపలు పెంచేది. ఇందుకోసం సుమారు 35 లక్షల చేప పిల్లలను సొంతంగా కొని చెరువుల్లో పోసేవారు. వాటి ద్వారా ఏటా దాదాపు 15కోట్ల రూపాయల మత్స్య సంపద చేతికి వచ్చేది. ప్రస్తుత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మొత్తం 278 చెరువుల్లో కాళేశ్వరం జలాలు ఉండడంతో మూడేండ్ల నుంచి రూ.2.5కోట్లకు పైనే చేప పిల్లలను ప్రభుత్వం ఉచితంగా చెరువుల్లో పంపిణీ చేసింది. పెంచిన చేపలను మత్స్య సహకార సొసైటీలు విక్రయించగా ఏటా రూ.114కోట్లకుపైనే ఆదాయం మత్స్య కార్మికుల చేతికి వస్తున్నది. ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని చెరువుల్లో పెరిగే కట్ల, రాహు, మెరిగల చేపల ధర మార్కెట్‌లో కిలో సరాసరి రూ.120 పలుకుతుందని మత్స్య కార్మికులు చెబుతున్నారు. చెరువుల్లో వేసే చేప పిల్లలు దాదాపు 50శాతం వేస్టేజీ కింద పోగా మిగిలిన చేపలను విక్రయిస్తుంటారు. కాళేశ్వరం ఆయకట్టు పరిధిలో ఐదేండ్లలో ఏటేటా మత్స్య సంపద పెరుగుతున్నది.

గతంలో మత్స్యకారులూ చేపలు కొనుక్కొని తినేవాళ్లం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు మత్స్యకారులు సైతం చేపలు కొనుక్కొని తినాల్సిన పరిస్థితి ఉండేది. వర్షాకాలంలోనూ చెరువుల్లో చుక్క నీరు ఉండేది కాదు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కేసీఆర్ సర్కార్ మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువులు పూడిక తీసి బాగు చేసింది. కాళేశ్వరం జలాలతో వాటిని నింపి మత్స్యకారులకు జీవనోపాధి కల్పించింది. ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేసింది. ఇప్పుడు ఎక్కడ చూసినా చేపలే. ప్రతి రోజూ వస్తున్న చేపలను స్థానికంగా, ఇతర ప్రాంతాలకు అమ్మి ఆర్థికంగా ఎదుగుతున్నాం.

–జంగా వెంకటేశ్వర్లు, నెమ్మికల్, మత్స్యకారుడు

టీజీఎల్‌ఏ ఉమ్మడి జిల్లా కార్యవర్గం

రామగిరి, జనవరి 5 : తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్(టీజీఎల్ఏ)ఉమ్మడి జిల్లా నూతన కమిటీని హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఎంపిక చేశారు. నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా జల్లల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కె.వెంకటేశ్వర్‌రావు, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా నవీన్‌కుమార్, నందిగామ ఈశ్వర్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మెరుగు లింగయ్య, దొడ్డి అశోక్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లా నరసింహకు అవకాశం కల్పించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా మాలె వెంకట్‌రెడ్డి, అందరి వెంకట్‌రెడ్డి, మందడి వెంకట్‌రెడ్డి, అంతయ్య, వనవర్తి శ్రీనివాస్, రమేశయ్య, చికోరి కృష్ణ, కన్నెబోయిన వెంకటేశ్వర్లు, మల్లేపల్లి గోవర్ధన్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు సంఘం బాధ్యులు వెల్లడించారు. ఎంపికైన వారికి రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటాద్రి కొండల్ పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

నూతనంగా ఎంపికైన వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీజీఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం, అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటాద్రి కొండల్

పామాయిల్ సాగుతో స్థిరమైన ఆదాయం

- నాబార్డు డీడీఎం సత్యనారాయణ

సింగారెడ్డిపాలెంలో డ్రిప్‌ను పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం సత్యనారాయణ, ఉద్యాన శాఖ అధికారులు

పెన్‌పహాడ్, జనవరి 5 : పామాయిల్ సాగు ద్వారా స్థిరమైన ఆదాయం పొందడమే కాకుండా సమీకృత వ్యవసాయానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని నాబార్డు డీడీఎం సత్యనారాయణ అన్నారు. మండలంలోని సింగారెడ్డిపాలెం, మాచారం గ్రామాల్లో పామాయిల్ తోటలను శుక్రవారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. పామాయిల్ క్షేత్రాల్లో అంతర పంటలుగా సాగు చేసిన టమాట, మిర్చి, కంది పంటలను పరిశీలించారు. ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న బిందు సేద్యం, పామాయిల్ సాగు సబ్సిడీల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ ఉద్యాన శాఖ అధికారి కన్న జగన్, పతంజలి కంపెనీ జిల్లా మేనేజర్ హరీశ్, ఫీల్డ్ ఆఫీసర్ సుధాకర్, డ్రిప్ కంపెనీ డీసీఓలు నర్సింహ, అనిల్ గణేశ్, మల్లేశ్, ఫీల్డ్ అసిస్టెంట్లు సుధాకర్, లక్ష్మీనారాయణ, రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న పీడీ గిరి వరప్రసాద్

నిడమనూరు, జనవరి 5 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ముగ్గురు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలికల విభాగంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు షేక్ ఆయేషా, నాదెండ్ల కీర్తి జైపూర్‌లో ఈ నెల 3 నుంచి ప్రారంభమైన పోటీల్లో పాల్గొంటుండగా, ఆయేషా జట్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే మండల కేంద్రానికి చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థి మల్లికంటి గణేశ్ బాలుర విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 7 నుంచి 11 వరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో రాష్ట్రం తరపున ఆడనున్నాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఆదర్శ విద్యార్థినులను ప్రిన్సిపాల్ రంజిత, ఫిజికల్ డైరెక్టర్ గిరి వరప్రసాద్ అభినందించారు.

హాలియా విద్యార్థి

తగుళ్ల కార్తీక్

హాలియా, జనవరి 5 : జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు హాలియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తగుళ్ల కార్తీక్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండా కృష్ణమూర్తి, పీడీ కోడుమూరి వెంకట్‌రాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఈ నెల 7 నుంచి 11 వరకు కామారెడ్డిలో జరుగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు అండర్-17 బాలుర విభాగంలో కార్తీక్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.